# కూతురు కాపురం

రైలాగింది. ద్వారం దగ్గర పోరాట పటిమకు సంబంధించి బల ప్రదర్శనం జరుగుతోంది. ఎక్కేవాళ్లకు, దిగేవాళ్లకు మధ్య జరుగుతున్న పోరాటం, టికెట్‌తో అవసరంలేని వినోదం కదా! చూస్తూ నిల్చుండిపోయానేమో, "ఏమండీ! లోపలికొచ్చే ఉద్దేశం లేదా? అక్కడే ఉండిపోతారా?" అంటూ అశరీరవాణిలా మాటలు వినిపించాయి. ఉలిక్కిపడి ఎట్లాగో లోపలికి దూసుకపోయి, అటువైపు ద్వారం దగ్గర మలుపుతిరిగి, అరలు సర్వే చేసుకుంటూ ముందుకెళ్తున్నాను. మూడో అరలో కిటికీ పక్కనే సీటు దొరక పుచ్చుకుని నాకు కూడా కొంచెం తావు రిజర్వు చేసుకుని "రండి రండి! ఇటు, యిటు..." అంటూ రాజేశ్వరి బరాబరులు పలుకుతోంది. ఎవరో కాదులెండి! మా ఆవిడే! అప్పటికే ఎదుటి సీట్లోని పెద్ద ముత్తయిదువతో మాటలు కలిపినట్టుంది... "చూచారా! బామ్మగారూ! ఇదీ వరస. నేను పిలవకపోయాననుకోండి! ఇకనంతే సంగతులు! కాక్ ఆఫ్ ఫ్లాట్‌ఫారమేననుకోండి..." తన దుస్థితిని నివేదించింది.

"ఎందుకులే తల్లీ! నేనడిగొచ్చిందిగూడా అంతే! మహానుభావుడు. ఉలకడు. పలకడు. పదును వానకైనా పదరడు. ఎండ, చలి, గాలి – దేన్నీ లెక్కపెట్టడు. యోగిసత్తము డనుకోవలసిందే? లంకంత సంసారాన్ని నేను కాబట్టి ఎట్లానో నెట్టుకొస్తున్నాను..." – ముక్తాయింపుతో ముసలావిడ శ్రుతి కలిపింది.

"అన్నట్టు మీరు మాతోబాటు స్టేషనులో రైలెక్కినట్టు లేదే! ఎక్కడినుంచి వస్తున్నారు బామ్మగారూ?" – వాకబు చేసింది రాజేశ్వరి.

"పెనుగొండ – అని పేరు విన్నావా? ఆ వూరమ్మా మాది. మా ఇంటాయనగూడా అంతో యింతో పేరున్నవాడే! ఈ కాలం భర్తపేరు చెప్పగూడదనేం లేదు గదా! నేనూ కొంచెం మీరిపోయాననుకో! సంగ్రహంగా జి.యస్.రావుగారంటారు. గిరినాథరావు గారన్నమాట! మా వారని చెప్పుకోడం కాదుగానీ కొండంత గుండెమ్మా ఆయనది. 'దయ' అనేది ఆయన ఇంటిపేరు. 'దాక్షిణ్యం' అన్నది వాళ్ల గోత్రం పేరు. ఎవరెవరు ఏది కావాలని వచ్చినా, తన దగ్గరున్నట్టయితే మారు మాట లేకుండా ఇచ్చేస్తారు. 'ఇలాగైతే ఎలాగండీ?' అంటే, 'చెలమలో తీసిన కొద్దీ నీళ్లూరుతాయిలేవే పిచ్చిదానా!" అంటారు. వెర్రిమారాజు, ఎన్ని జన్మల బంధమో, నాపాలబడ్డారు. గీచిన గీటు దాటడు గదా! 'అబ్బో, ఎంత అదృష్టమో' అనుకుంటారమ్మా లోకులు నన్ను గురించి..."

"మరి మీరు మిమ్మల్ని గురించి ఏమనుకుంటారు బామ్మగారూ?" – ఇంటర్వ్యూకు కూర్చున్న పత్రికా విలేఖరిలా అడిగింది రాజేశ్వరి.

"వద్దులేమ్మా! ఆత్మస్తుతి తప్పు కదూ?".

పెద్దామెగూడా వీలయినంత గడసరితనంతో రాజేశ్వరి విసిరిన ఉచ్చులోనుంచి తప్పించుకుంది.

'ఎవరోగానీ ఈమె సామాన్యురాలుగాదు. తనలాంటి లేతబుర్రల్ని ఎన్నింటిని చూచిందో! ఈవిడతో వీలైనంత సత్యసరళంగా మాట్లాడా'లని అనుకున్నట్టుంది రాజేశ్వరి "మీరు చెప్పకపోతే మాత్రం ఆ మాత్రం తెలుసుకోలేకపోతామంటారా బామ్మగారూ?

ముంజేతి కంకణానికి అద్దం కావాలా? పచ్చి పసుపుకొమ్ము దంచి ఆ పిండితో చేసిన బొమ్మలా ఉండిపోతిరి. తూరుపు ఆకాశంలో పొడుచుకొచ్చే సూర్యబింబంలాంటి బొట్టు. ఎర్రరాళ్ల కమ్మలపైన తెల్లరాళ్లు పొదిగిన మాటీలు, కెంపుతో మిలమిలలాడే ముక్కుపుడక, ఈ వయసులోనే ఇలా ఉన్నారంటే, ఇక మీ ప్రాయంలో మీరెంత బాగుండేవారో! మీ కడుపున ఓ ఆడబిడ్డ పుట్టివుంటే ఆ యమ్మా మరీ ఎంత బాగుండేదో..."

"ఉందమ్మా వుందీ..." గబాలున అందిపుచ్చుకుంది పెద్దావిడ – "నాటికీ నేటికీ అది తీర్చిదిద్దిన అందాల కొలువేగదమ్మా! బిడ్డకేం పేరు పెట్టాలో తోచలా, మా ఇంటికొచ్చి పోతూ వుండే సాధువుల్ని అడిగాము. ఒకాయన "కళ్లు పెద్దవిగా ఉన్నాయి గదా! విశాలాక్షి అనగూడదా?' అన్నాడు. ఇంకొకాయన 'అరరే, కనుపాపలు చేపపిల్లల్లా సంచలిస్తున్నాయి గదమ్మా, మీనాక్షీ అనరాదూ?' అన్నాడు. 'ఈ బంగారు తీగకు మరొకపేరు, మరొకపేరు ఎందుకు? హేమలత అంటే సరిపోలా?' అన్నాడు మరొకాయన. 'మీ యింట్లో 'లలిత' పుట్టిందమ్మా!' అంటూ ఒక యోగి పరవశించిపోయాడు. తండ్రికదంటే ప్రాణం. నాకూ గారాబమేగానీ, ఆడబిడ్డపైన మమకారం పెంచుకోవచ్చునా? ఏనాటికైనా ఓ అయ్య చేతికి పట్టిచ్చి, అత్తారింటికి సాగనంపాల్సినవాళ్లమే గదా? అక్కడేనమ్మా వచ్చింది చిక్కు. దానిది బొత్తిగా 'లవ్' వ్యవహారమైపోయింది..."

"లవ్వా? ఎవర్ని ప్రేమించిందండీ బామ్మగారూ?" – రాజేశ్వరి పాలిటికి కథ రసపట్టులోకి వచ్చేస్తున్నట్టే వుంది.

"ఎవరో, ఊరేమిటో, పేరేమిటో – తల్లెవరో, తండ్రెవరో – కులమేమిటో, గోత్రమేమిటో – డ్యాన్సు మాష్టరట. ఉదయం లేస్తే డ్యాన్సే. పొద్దుపోతే డ్యాన్సే. ముతక బట్టలు తప్పితే మరొకటి కట్టడు. ఏ తల్లి పిలిచి పెడితే అక్కడ తినేస్తాడు. రూపమైతే బాగానే ఉండేదనుకో, మనిషిగూడా గుంభనంగానే వుంటాడు. కానీ, చిల్లిగవ్వ ఆస్తిలేదు. ఏంజూసి వలచిందో ఈ పిల్ల! 'చేస్తే ఆయనకే చెయ్యండి. లేకుంటే ఇలాగే వుండిపోనివ్వండి!' అంటూ మంకుపట్టు పట్టేసింది. అపురూపంగా ఒక బిడ్డను కనిపెట్టుకున్నవాళ్ళం. తప్పలేదమ్మా మాకు. ఇచ్చేశాం. ఇక మనకేం హక్కుంటుంది? ఆయనగారు పెళ్లాన్ని మన రాళ్లసీమనుంచి, ఈ కోస్తావైపు తీసుకొచ్చేశాడు..."

"పోనీలేండి! ఏదో ఒక కళ చేతిలో వుందిగదా! బతకలేకపోరు. ఏమండీ, బామ్మగారూ! అమ్మాయికిప్పుడు కొరతేమీ లేదుగదా?"– పాపం, రాజేశ్వరికైనా సమాధానం చాలా పాజిటివ్‌గా రావాలనే వుంది.

ముసలావిడ కొనసాగించింది.

"మా యింటి మాణిక్యాన్ని చేబట్టాక ఆయనకంతా కలిసొచ్చిందిలే తల్లీ! మేడలొచ్చాయి. మండువాలొచ్చాయి. పాయసాలొచ్చాయి. ప్రాసాదాలొచ్చాయి. అలంకారాలొచ్చాయి. ఆడంబరాలొచ్చాయి. వచ్చిపోయే బలగం బలిసింది. ఎటొచ్చీ అప్పటికీ యిప్పటికీ అల్లుడుగారు మాత్రం భోళారాయుడే! పాదాలపైన పడేవాడికి, నెత్తిపైన చేయి పెట్టేవాడికి తేడా ఏమిటో తెలియదుగదా! ఎదుటికొచ్చినవాడెవడు? వాడి అంతస్తేమిటి? ఆంతర్యమేమిటి?– అని తెలుసు కోకుండా కోరిన గొంతెమ్మ కోరికలన్నీ

తీర్చడమేనా? అందువల్ల చిక్కులు రావూ? వచ్చాయమ్మా, వచ్చాయి. నారాయణమూర్తి గారని ఈయనకొక స్నేహితుడున్నాడులే! మహానుభావుడు. ఆయనవల్ల ఎన్నిసార్లు గడచి గట్టెక్కినాడో..."

"బామ్మగారూ! మనమళ్లను గురించి, మనవరాళ్లనిగురించి చెప్పకనేపోతిరే..." రాజేశ్వరి కొనసాగిస్తున్న ఇంటర్వ్యూ నిరాఘాటంగా సాగిపోతోంది.

"ఇద్దరు బిడ్డలూ మనవళ్లేనమ్మా!" కొనసాగిస్తోంది బామ్మగారు...

"అందులో పెద్దబ్బాయి వెయ్యిళ్ల వేలుపు. ఏ యింట్లో అడుగు పెడితే ఆ యింట్లో అన్నీ శుభాలే ఒనగూడుతాయని ఒక నమ్మకం ఏర్పడిపోయింది. అందరూ ఆహ్వానించడమే. అందరూ షడ్రసోపేతంగా విందులు పెట్టడమే. పేరుకేం తక్కువలేదు. కానీ పెళ్లయితే చేసుకోలేదు. ఆ లోటు పూరించడానికన్నట్టుగా చిన్నబ్బాయికి రెండు వివాహాలు, ముద్దులు మూటలు గట్టే కోడళ్లు. లోక వ్యవహారాలన్నీ భర్తవైతే, ఈ భార్యలు బచ్చాన బొమ్మల్లా తిరుగుతూ ఇంటి పనులు చక్కబెట్టుకుంటారు. అత్తకు కాసంతపని పెట్టరు. ఆమె కాలుపైన కాలు వేసుకుని కూచోవలసిందే..."

"చాలా సంతోషమండీ బామ్మగారూ! ఇప్పుడు అమ్మాయినీ బిడ్డల్ని చూచిరావడం కోసమని బయల్దేరినట్టున్నారు కదండీ!" అంది రాజేశ్వరి.

పెద్దావిడ ముఖంలో విచారతరంగం ఒకటి పారాడింది. "ఏం సంతోషమో ఏమో! ఈ మధ్య అమ్మాయి యింట్లో దొంగలు పడ్డారట. వాళ్లేమైనా చెప్పి పంపించారా? కర్ణాకర్ణిగా తెలిసింది. ఎంతపోయిందో, ఏమిటో? అమ్మాయి దిగులు పడిపోయిందేమోనని నా బెంగ. అందుకేనమ్మా వెళ్తున్నా..."

రైలు కృష్ణానది వంతెనపై తిరుగిడుతోంది. ప్రయాణీకులు పెట్టెలు, బుట్టలు సర్దుకుని దిగిపోవడానికి సిద్ధమౌతున్నారు. ప్లాట్‌ఫారం వచ్చేస్తుంటే నేను రాజేశ్వరి వెలుపలికి చూస్తున్నాము. నీటిలోనుంచి నీడ జారిపోయినట్టుగా ముసలావిడ ఎప్పుడు దిగిపోయిందో తెలియదు. కొంతసేపటికి ప్లాట్‌ఫారంపైన కిటికీలోనుంచే కనిపించింది. రాజేశ్వరి విస్మయపడిపోతూ "ఏమిటండీ బామ్మగారూ! చెప్పకుండానే దిగిపోయారే! ఇక్కడేనా మీ అమ్మాయి వుండడం?" అని ప్రశ్నించింది.

"ఇదేనమ్మా! అదిగో ఆ కొండపైన కనిపించడంలా; ఆ యిల్లే!"

ఆనందాశ్చర్యవిభ్రమాలతో రాజేశ్వరి తత్తళించిపోయింది. "అదేనా? ఆ యిల్లేనా? మీ అమ్మాయి పేరేమిటన్నారండీ బామ్మగారూ?"

"పేరు నేనెక్కడ చెప్పానమ్మా? అందరికీ తెలిసిందేలే, కనకదుర్గ..."

'కనకదుర్గ, కనకదుర్గ...'- రాజేశ్వరి పెదవులు సవ్వడిలేకుండా చలిస్తున్నాయి. జనసమూహంలో కనుమరుగైపోయిన బామ్మగారు మళ్లీ కనిపించనేలేదు.

❖ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 19, ఏప్రిల్, 1999. ❖